RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: 99637 08331

| Malkajgiri | Volume: 3 | Issue: 130 | Saturday, August 30, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/- |
|---|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 130 | శనివారం, ఆగస్టు 30, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /- |

## వరద నీటిలో మునిగిపోయిన ఏడుపాయల టెంపుల్..



**హైదరాబాద్:** ప్రముఖ దేవాలయం ఏడుపాయల టెంపుల్ వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వరదనీరు దేవాలయం పైవరకు చేరుకుంది. వరద పొటెత్తడంతో దేవాలయం వైపు భక్తులు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కుండపోత వానలు పడుతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల్లో వానలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కామారెడ్డి పట్టణం వరదల్లో చిక్కుకుంది. జిల్లాల్లోని పలు గ్రామాలు, తండాలను వరద ప్రవాహం ముంచెత్తింది. దీంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

## రుషికొండ ప్యాలెస్‌ను ఏం చేయాలో తెలీట్లా: పవన్

**అమరావతి:** వైసీపీ పాలనా కాలంలో విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌ను ఏం చేయాలో తెలియడం లేదని జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. దీని నిర్మాణానికి 500 కోట్లకు పైగానే ప్రజాధనం వెచ్చించారని తెలిపారు. విశాఖలో సేనతో సేనాని కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో తాజాగా పవన్ కల్యాణ్ రుషికొండను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన.. ప్యాలెస్‌లోని ప్రతి గదినీ పరిశీలించారు. అనంతరం.. మాట్లాడుతూ.. ప్యాలెస్‌లోని రెండు బ్లాక్‌ల నిర్మాణానికి 90 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. ఇక, ప్రధాన బ్లాక్‌ను 70 కోట్ల వ్యయంతో నిర్మించారన్నారు. మొత్తం ఏడు బ్లాకులుగా దీనిని నిర్మించాలని ప్లాన్ చేశారని, కానీ, 4 మాత్రమే నిర్మించారని చెప్పారు. ఈ 4 బ్లాకులతోకే 454 కోట్లను ఖర్చు చేశారని, మిగిలిన వాటికి అంచనాలు లేవని వ్యాఖ్యానించారు. ప్రజాధనాన్ని వృథా ఎలా చేయొచ్చో.. వైసీపీ పాలనను చూస్తే అర్థం అవుతుందని విమర్శించారు. "గతంలో మమ్మల్ని రానివ్వలేదు%ౌ% ఎన్నో అడ్డంకులు సృష్టించారు. గతంలో రిసార్ట్స్ ఉన్నప్పుడు సంవత్సరానికి 7 కోట్లు ఆదాయం ఉండేది. ప్రస్తుతం కేవలం కరెంట్ బిల్లు కట్టడానికి సంవత్సరానికి 15 లక్షలు అవుతోంది. దీనిని చెల్లిస్తున్నాం. మిగతా వాటికోసం ఇంకా మాట్లాడనవసరం లేదు, ఇప్పటికే జరగాల్సిన డ్యామేజ్ జరిగింది. లోపల పెచ్చులు ఊడిపోతున్నాయి కొన్ని చోట్ల లీకేజ్ అవుతోంది. " అని పవన్ వ్యాఖ్యానించారు. అప్పటి సీఎం జగన్ ఇక్కడ



నివాసం ఉండేందుకు.. ఈ ప్యాలెస్‌ను నిర్మించుకున్నారని పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఒక ముఖ్యమంత్రి నివాసానికి 500 కోట్లు వెచ్చించడం ఎక్కడా లేదన్నారు.

ఇక, ఇప్పుడు ఈ ప్యాలెస్‌ను పర్యాటక ప్రాంతంగా మార్చాలని ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. అయితే.. ఇలా చేస్తే ఆదాయం వస్తుందా? రాదా? అనేది డోలాయమానంగా ఉందన్న పవన్ కల్యాణ్.. మేజర్ గా ఈ నిర్మాణాన్ని ఎలా ఉపయోగించాలో ఆలోచన చేస్తున్నామన్నారు.

### చిరంజీవిని కలిసేందుకు..

## సైకిల్‌పై వచ్చిన మహిళ అభిమాని

**హైదరాబాద్:** మెగాస్టార్ చిరంజీవికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎన్నో దశాబ్దాల నుంచి ఆయన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. సినిమాల్లోనే కాక.. బయట కూడా ఎందరికో సహాయం చేస్తూ.. రియల్ హీరో అనిపించుకున్నారు చిరు. అయితే చిరుని కలిసేందుకు రోజు కొన్ని వేలల్లో అభిమానులు వస్తుంటారు. కానీ, అందరికి చివరికి ఒకటో, ఇద్దరికో చిరును కలిసే అదృష్టం లభిస్తుంది. ఓ మహిళ అభిమని కూడా చిరును కలుసుకొని సంతోషంగా పడ్డారు. కర్నూలు జిల్లా ఆదోని నుంచి రాజేశ్వరి అనే మహిళ సైకిల్‌పై హైదరాబాద్ వరకూ వచ్చారు. 300 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ వచ్చి చిరంజీవిని కలిశారు. చిరంజీవి రాజేశ్వరిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆమె చిరు చేతికి రాఖీ కట్టారు. చిరు ఆమెకు ఆర్థికసాయం చేసి.. చిరను బహుకరించారు. ఆమె పిల్లల చదువుకు పూర్తి బాధ్యత తనదే అని.. వాళ్లు ఎంతవరకూ చదువుకుంటే అంతవరకూ చదివిస్తానని హామీ ఇచ్చారు. చిరంజీవి



అలా చెప్పడంతో రాజేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. అందరూ మెగాస్టార్ మంచి మనస్సును మెచ్చుకుంటూ కామెంట్ చేస్తున్నారు.

### హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం..

## స్తంభించిన జనజీవనం..




**హైదరాబాద్:** నగరంలోని పలు ప్రాంతాల్లో గంట సేపటి నుంచి ఏకధాటిగా భారీ వర్షం కురుస్తోంది. హిమాయత్ నగర్, నారాయణగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ట్యాంక్ బండ్, అంబర్ పేట్, కాచిగూడ, ఓయూ క్యాంపస్, విద్యానగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి. లకిడీకాపూల్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్ సెక్రటేరియట్, ట్యాంక్ బండ్, తెలుగు తల్లి ఫ్లైఓవర్, ఐమాక్స్, ఎన్టీఆర్ గార్డెన్స్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ ప్రయాణం కోసం గంటల సమయం పడుతోంది. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో నగర వాసులకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. అవసరం ఉంటేనే తప్ప బయటకు రావద్దని స్పష్టం చేసింది.

**సెప్టెంబర్ 2 వరకు తెలంగాణలో వర్షాలు**

రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 2వ తేదీ వరకు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. రేపు(శనివారం) ఆదిలాబాద్ కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్ నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపింది.

## భారత్ కు జపాన్ కీలక భాగస్వామి : మోడి


**జపాన్:** అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటి అని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. భారత్ కు అత్యంత విశ్వసనీయ దేశం జపాన్ అని అన్నారు. ప్రవాస భారతీయుల సదస్సుకు మోడీ హాజరయ్యారు. టోక్యోలో మోడీ ప్రసంగించారు. ప్రపంచ వృద్ధిలో 18 శాతం భారత్ దే అని ఆర్థికంగా భారత్ వేగంగా వృద్ధి చెందుతోందని ప్రశంసించారు.

భారత్ కు జపాన్ కీలక భాగస్వామి అని భారత్–జపాన్ వాణిజ్య భాగస్వామ్యం అత్యంత కీలకమని నరేంద్రమోడీ తెలియజేశారు.



## టారిఫ్ వార్ తాత్కాలికమే

**న్యూఢిల్లీ :** భారతీయ ఉత్పత్తులపై అమెరికా అదనంగా విధించిన 25 శాతం సుంకం ఆగస్టు 27 నుంచి అమలులోకి వస్తున్నది. ఈ మేరకు అమెరి కా ఓ ముసాయిదా నోటీసు జారీ చేసింది. దీని ప్రభావం భారతదేశం అమెరికాకు చేసే 48 బిలియన్ అమెరికా డాలర్ల ఎగుమతులపై పడుతుం ది. అమెరికా మార్కెట్ లో ప్రవేశించే భారతీయ వస్తువులపై సుంకం మొత్తం మీద ఇప్పుడు 50 శాతంగా ఉంటుంది. రష్యా నుంచి చమురు, సై నిక పరికరాలు కొనుగోలు చేసినందుకు జరిమానాగా అమెరికా ఆగస్టు 7న భారతీయ ఉత్పత్తుల పై 25 శాతం సుంకాన్ని విధించింది. ఆగస్టు 27 నుంచి మరో 25 శాతం సుంకాలను విధిస్తున్న ట్లు ప్రకటించింది. పెంచిన సుంకాలు 2025 ఆగస్టు 27 మధ్యాహ్నం 12.01 గంటల నుంచి అమలులోకి వస్తాయని అమెరికా డిపార్ట్ మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ పేర్కొంది. అధిక సుంకాన్ని చెల్లించాల్సిన ఉత్పత్తులలో వస్త్రాలు, దుస్తులు, రత్నాలు, ఆభరణాలు, రొయ్యలు, తో లు ఉత్పత్తులు, పాదరక్షలు, జంతు ఉత్పత్తులు, రసాయనాలు, విద్యుత్, యంత్రాలు ఉన్నాయి. ఫార్మా, ఇంధన ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులకు ఈ అదనపు సుంకం వర్తించదు. భారతదేశంతో పాటు బ్రెజిల్ పై అమెరికా 50 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతులపై దాదాపు 48.2 బిలియన్ డాలర్ల అదనపు సుంకాలు చెల్లించాల్సివస్తుందని వాణిజ్య మంత్రిత్వశాఖ పేర్కొంది. రష్యా– ఉక్రెయిన్ యుద్ధం ముగించేలా వత్తిడి తెచ్చేందుకే అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ భారతదేశంపై ఆంక్షలు విధించారని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఈ నెలారంభంలో పేర్కొన్నారు. కాగా, రష్యా చమురును తిరిగి అమ్మడం ద్వారా భారతదేశం ఆర్థికంగా లాభపడిందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఆరోపించారు. అమెరికా చర్యను ఆగస్టు 6నే భారతదేశం గర్హించింది.



అది అన్యాయం, అసమంజసం అని పేర్కొంది. కొత్త లెవీ తర్వా తక్కువ సుంకాల కారణంగా భారతదేశ పోటీదారులు మయన్మార్ థాయిలాండ్, కంబోడియా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, చైనా, శ్రీలం మలేషియా, ఫిలిప్పైన్స్, వియత్నాం అమెరికా మార్కెట్ లో మెరుగై స్థానంలో ఉంటారు. 2021–22 తర్వాత అమెరికా భారతదేశాని అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలిచింది. 2024–15లో ద్వైపాక్షి వాణిజ్యం 131.8 బిలియన్ డాలర్లకు చేరింది. అమెరికా డేట ప్రకారం భారతదేశ ఎగుమతులు 91.2 బిలియన్ అమెరిక డాలర్లు. 50శాతం సుంకం వల్ల తీవ్రంగా ప్రభావం పడే వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, రొయ్యల ఎగుమతుల పైనే అమెరికా భారీ సుంకాల కారణంగా భారతీయ పరిశ్రమలక ఇబ్బందులు తప్పకపోవచ్చు. అమెరికా %–% భారత ద్వైపాక్షి వాణిజ్య ఒప్పందం పై స్పష్టత వచ్చేవరకూ కంపెనీలు సిబ్బంది తగ్గించుకుని, ఉత్పత్తిని నిలిపివేయవలసి ఉంటుందని తోలు పాదరక్షల పరిశ్రమ అధికారి ఒకరు తెలిపారు.

# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### అమెరికా ద్వంద్వనీతి

తనకుతాను అగ్రరాజ్యంగా చెప్పుకుంటూ.. ప్రపంచ దేశాలకు పెద్దన్నలా వ్యవహరిస్తున్నానని భావిస్తున్న అమెరికా.. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయిల్–గాజా యుద్ధాల పట్ల ద్వంద నీతిని ప్రదర్శిస్తున్నది. ఉక్రెయిన్‌పై రష్యా దాడికి పరోక్ష సహకారం అందిస్తున్నారనే ఆరో పిస్తూ.. ట్రంప్ ఇప్పటికే భారత్‌పై యాభై శాతం సుంకాలు విధించారు. అంతేకాకుండా రష్యాకు సహకరించే చైనాతోపాటు ఇతర దేశాలపైనా చర్యలుంటాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో సామాన్య పౌరుల మరణాల గురించి ప్రస్తావిస్తున్న అమెరికన్ ప్రెసిడెంట్‌కు.. ఇజ్రాయిల్–గాజా యుద్ధంలో మరణిస్తున్న చిన్నారులు, మహిళలు, వృద్ధుల మృత్యుఘోష వినిపించడం లేదా? ఆకలితో అలమటిస్తూ పోషకాల లోపంతో మరణిస్తున్న చిన్నారుల ఆర్తనాదాలు చెవికెక్కడం లేదా? స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు అంటూ ప్రపంచానికి ప్రవచనాలు బోధించే అమెరికా.. రెండు ప్రధాన యుద్ధాల పట్ల ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నది. అగ్ర రాజ్యం మాటలు, చేతల మధ్య స్పష్టమైన వైరుధ్యం కనిపి స్తున్నది. దీంతో అగ్రరాజ్యం నైతికతలో రాజకీయ ప్రయోజనాలే ప్రధానమని స్పష్టంగా అర్థమవుతున్నది. నాటోలో సభ్యత్వం కోసం ఉక్రెయిన్ పావులు కదుపు తున్నదని తెలియగానే 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దాడులు ప్రారం భించింది. అయినా 2022లో ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేయగా.. దాడులను మరింత ముమ్మరం చేసింది. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అగ్రరాజ్యాన్ని సైతం హెచ్చరించింది. అయితే సభ్యత్వం ఇవ్వాలా?వద్దా? అనే దానిపై నాటో దేశాలు ఇప్పటికీ తమ నిర్ణయాన్ని ప్రకటించకపోయినా.. రష్యా దాడులను అవి ఖండించాయి. రష్యా చర్యలను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా, ఐరోపా భద్రతకు ముప్పుగా అభివర్ణించాయి. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా చమురు, గ్యాస్, వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవద్దని ఇతర దేశాలపై ఒత్తిడి తెస్తున్నాయి. అంతేకాకుండా అమెరికాతోపాటు జర్మనీ, బ్రిటన్, నార్వే, డెన్మార్క్, స్వీడన్, నెదర్లాండ్స్, పోలాండ్, లిథువేనియా వంటి యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు, యాంటీ ట్యాంక్ క్షిపణులు.. డ్రోన్లు, ఇతర ఆయుధాలు సరఫరా చేయడమే కాకుండా ఆర్థిక సహకారమందిస్తున్నాయి. మరోవైపు రష్యా ఆస్పత్రులు, పాఠశాలలపైనా దాడులు చేస్తున్నదని గగ్గోలు పెడుతున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన ఏడాదిన్నర తర్వాత అంటే 2023 అక్టోబర్ లో ఇజ్రాయిల్– గాజా యుద్ధం ప్రారంభమైంది. అయితే ఇక్కడ ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. పాఠశాలలు, ఆస్పత్రులు, సామాన్య పౌరులు నివసించే ఇండ్లు అనే తేడా లేకుండా బాంబుల వర్షం కురిపిస్తున్నది. చిన్నారులు, మహిళలు, వృద్ధులను సైతం బలితీసుకుంటున్నది. మాన వతా సహాయం అందకుండా అడ్డుగోడగా నిలిచి ఆకలి మరణాలకు కారణమవుతున్నది. కానీ ఇవేమీ అగ్రరాజ్యం అమెరికాకు కనిపించడం లేదు. అయితే గాజాపై దాడులను కనీసం ఖండించని అమెరికా.. మరోవైపు ఇజ్రాయిల్‌కు బిలియన్ డాలర్ల ఆయుధాలను సరఫరా చేస్తున్నది. యుద్ధ నేరాల విషయంలో రష్యాపట్ల కఠినంగా వ్యవహరించిన అమెరికా.. ఇజ్రాయిల్ విషయంలో మాత్రం ఐక్యరాజ్య సమితి భద్రతా మం డలిలో వచ్చిన తీర్మానాలను వీటో చేసింది. ఇజ్రాయిల్ యథేచ్ఛగా అనేక ఉల్లంఘనలకు పాల్పడుతున్నా ఎటువంటి ఆంక్షలు విధించలేదు. కనీసం విమర్శించనూలేదు. గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ. 2023 అక్టోబర్ నుంచి గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో సుమారు 60వేల నుంచి 80 వేలమంది వరకు మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ, నేచర్ నివేదికల ద్వారా స్పష్టమవు తున్నది. ఇందులో సుమారు పద్దెనిమిది వేల మంది చిన్నారులు ఉ ండగా, పదిహేను వేల కంటే ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. రెండు వేల మంది వరకు వృద్ధులు ఉన్నట్టు అంచనా. పందొమ్మిది లక్షల మంది నిర్వాసితులయ్యారు. గాజాలో మరణించిన వారిలో 59.1 శాతం మహిళలు, చిన్నారులు, వృద్ధులున్నారని లాన్సెట్ ఒక నివేదికలో స్పష్టం చేసింది. ఇప్పటికే వందలాది మంది ఆకలితో మరణించినట్టు పలు రిపోర్టుల ద్వారా తెలుస్తున్నది. ఇందులోనూ ఎనభై శాతం మంది చిన్నారులు ఉండడం మనసులను కలచివేస్తున్నది. అదే ఉక్రెయిన్‌లో పౌరమరణాలు పధ్నాలుగు పకొండు వేల వరకు మాత్రమే ఉంటాయని ఒక అంచనా. అంటే గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ. మానవ హక్కుల విషయంలో రష్యాను పదేపదే విమర్శిస్తున్న అమెరికా..

ఇదే ఇజ్రాయిల్ విషయంలో మాత్రం మౌనంగా ఉండడం అగ్రరాజ్యం ద్వంద్వ నీతికి నిదర్శనంగా నిలుస్తున్నది. అంటే మానవ హక్కులు అనేది రాజకీయ ప్రయోజనాలు సాధించేందుకు ఒక ఆయుధంలా మాత్రమే పనికొస్తున్నాయనేది స్పష్టమవుతున్నది. కనీసం విమర్శించనూలేదు. గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ.

# జవహర్ నగర్ రోడ్ల మరమ్మత్తులపై బిజెపి నేతల హర్షం

**- నిమజ్జనం లోగా మిగిలిన రోడ్ల పనులు పూర్తి చేయాలని కోరిన బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగుల శంకర్ నేత**






**జవహర్ నగర్: తెలంగాణ షాన్, ఆగస్టు 29:** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బాలాజీ నగర్ ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను పూడ్చేందుకు అధికారులు చేపట్టిన పనులపై బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగుల శంకర్ నేత, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి ముత్యం సుజాత, వైస్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ ఈ పనులను పరిశీలించి, వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న జవహర్ నగర్ కమిషనర్ ఎన్.వసంతకు ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో, నగరంలో ఇంకా చాలా చోట్ల రోడ్లపై గుంతలు పూడ్చాల్సిన అవసరం ఉందని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అనేక ప్రధాన రహదారులు, గల్లీ రోడ్లు దెబ్బతిని, వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జనం సమీపిస్తున్నందున మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. అంతేకాకుండా, పాఠశాలలు మరియు ప్రధాన రహదారుల కూడళ్ళ వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కూడా నేతలు డిమాండ్ చేశారు. దీనివల్ల ప్రమాదాలను నివారించవచ్చని వారు సూచించారు. ఈ సమస్యలపై కూడా తక్షణమే చర్యలు తీసుకోవాలని రంగుల శంకర్ నేత కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు కూడా పాల్గొన్నారు.

# స్థానిక విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో వినాయక అన్న ప్రసాద మహోత్సవం






**సికింద్రాబాద్, తెలంగాణ షాన్, ఆగస్టు 29:** పాట్ మార్కెట్ స్థానిక విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం పి.వి. కాంప్లెక్స్‌లో జరిగిన వినాయక అన్న ప్రసాద మహోత్సవం అశేష జనవాహిని మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ అన్న ప్రసాద కార్యక్రమంలో సంఘం సభ్యులతో పాటు బంధుమిత్రులు, భక్తజనం అధిక సంఖ్యలో పాల్గొని వినాయకుని కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా, భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక సందేశాలతో పి.వి. కాంప్లెక్స్ ప్రాంగణం నిండిపోయింది. ఈ మహోత్సవం కేవలం అన్నదాన కార్యక్రమంగా కాకుండా, విశ్వకర్మ సంఘం సభ్యుల మధ్య ఐక్యత, సమిష్టి కృషిని చాటి చెప్పేలా సాగింది. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డి.నాగేంద్ర రాజు (రాజప్ప) పాల్గొని గణనాథుని దర్శించుకున్నారు. ఆయనను పి.వి. కాంప్లెక్స్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం, సంఘానికి ఎనలేని సేవలు అందించిన గౌరవనీయ అధ్యక్షులను కూడా గౌరవించారు. స్థానిక విశ్వకర్మ సంఘం మాజీ అధ్యక్షుడు పోలోజు బ్రహ్మచారి, ఎర్రవెల్లి నిరంజన్ చారి , మంగోల్ నరసింహ చారి, రుద్రవరం రాము ను సత్కరించారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు, సహాయం అందించిన సభ్యులందరికీ పి.వి. కాంప్లెక్స్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు

**- ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూప్ మరియు తెలుగు నాడు సమితి తెలుగు భాషా దినోత్సవ వేడుకలు**



**కాప్రా ఆగస్టు 29:** ప్రజా భాషా ప్రస్థానానికి పునాది వేసిన మహాకవి, మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని శుక్రవారం ఉ దయం చర్లపల్లి ఈసీ నగర్ లోని కృపా నికేతన్ పాఠశాలలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, తెలుగునాడు సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆగస్టు 29న ప్రతి సంవత్సరం జరుపుకునే తెలుగు భాష దినోత్సవం వేడుకలు నేడు కృపా నికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ శరత్ అధ్యక్షతన వైభవంగా జరిగాయి. ఈ సభలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ నాయకులు జె శ్రీమన్నారాయణ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి జీవిత విశేషాలను, ఆయన గ్రాంధిక భాషకు వ్యతిరేకంగా వ్యవహారిక తెలుగు భాషా అమలుకై చేసిన పోరాటం గురించి వివరించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు చేసిన "వ్యావహారిక భాషా ఉద్యమం"ను స్మరించుకొని, ఆయన కృషితో తెలుగు భాష సాధారణ ప్రజలకు మరింత చేరువైందని వివరించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ గిడుగు తెలుగు భాషా పరిరక్షణకు చేసిన కృషి, ప్రజల వాడుక భాషలో రచనలు చేసిన గురజాడ అప్పారావు, వేమన పద్యాల విశిష్టతను వివరించారు. "గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషి ద్వారానే తెలుగు భాష ప్రజలతో ఇంతగా కలిసిపోయిందని" ఆయన పేర్కొన్నారు. తెలుగునాడు సమితి అధ్యక్షుడు గుమ్మడి హరిప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు తెలుగునాడు సమితి చేస్తున్న కృషిని వివరించారు. తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులు తెలుసుకొని భవిష్యత్ తరాలకు అందించాలని అయన కోరారు. ధరణి తెలుగు దినపత్రిక ఎడిటర్ జి రోజా రాణి మాట్లాడుతూ మన మాతృభాష అయినటువంటి తెలుగు భాష ఎంతో ఉన్నతమైనదని, తెలుగు భాషలో విద్యను అభ్యసిస్తే త్వరగా అవగతం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృపా నికేతన్ స్కూల్ కరస్పాండెంట్, తానియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ జడ్పీహెచ్ఎస్‌కు బీపీసీఎల్ ఆర్థిక సాయం: స్కూల్ ఫర్నిచర్, ఆర్.ఓ ప్లాంట్ ప్రారంభించిన మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్





**జవహర్ నగర్ తెలంగాణ షాన్, ఆగస్టు 29:**
జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుంచి మల్కాజ్గిరిలోని బాలానగర్, జవహర్ నగర్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సహాయం అందించింది. మహిత ఎన్.జి.ఓ. సహకారంతో, పాఠశాలకు అవసరమైన స్కూల్ ఫర్నిచర్ మరియు పరిశుభ్రమైన తాగునీటి కోసం ఆర్.ఓ. ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ?ఈ కొత్త సౌకర్యాలను మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకోవడానికి మంచి వాతావరణం, మౌలిక సదుపాయాలు చాలా ముఖ్యమని అని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం బీపీసీఎల్ మరియు మహిత ఎన్.జి.ఓ. ముందుకు వచ్చి చేసిన ఈ కృషిని ఆయన అభినందించారు.

?"కార్పొరేట్ సంస్థలు సమాజానికి తమ బాధ్యతగా ఇలాంటి ప్రాజెక్టులలో భాగం కావాలి," అని ఈటల రాజేందర్ అన్నారు. కొత్త ఫర్నిచర్ వల్ల విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చోని పాఠాలు వినవచ్చని, అలాగే ఆర్.ఓ. ప్లాంట్ ద్వారా వారు పరిశుభ్రమైన నీటిని తాగవచ్చని ఆయన తెలిపారు. ?ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మరియు స్థానిక ప్రముఖులు కూడా హాజరయ్యారు. ఈ కొత్త సౌకర్యాలు పాఠశాలకు ఎంతగానో ఉపయోగపడతాయని అందరూ సంతోషం వ్యక్తం చేశారు.

# చిన్నక్రాంతి కాలనీలో ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం

**-కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్**



**మేడిపల్లి, ఆగస్టు 29:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిన్న క్రాంతి కాలనీలో కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్న క్రాంతి కాలనీ మహిళలు శాస్త్రోక్తంగా,వేద పండితుల మంత్రోచ్ఛరణతో కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న క్రాంతి కాలనీలో గణేష్ నవరాత్రులు విశేష పూజలతో నిర్వహిస్తున్నామని కాలని అధ్యక్షుడు మేడ బాపురాజు, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, కోశాధికారి శివ కుమార్ అన్నారు. మా కాలనీ అభివృద్ధికి కృషిచేసిన ప్రతి నాయకునికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ వినాయకుని ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గొరిగే నరసింహ కురుమ,వర్కింగ్ ప్రెసిడెంట్ నిలుగొండ వెంకటేష్ గౌడ్,ఉపాధ్యక్షులు పోలు విక్రమ్ గౌడ్, రామరాజు, సంపత్,సంయుక్త కార్యదర్శులు రవీందర్,శివరాత్రి నరేష్, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్ చారి, సాంస్కృతిక కార్యదర్శిలు ప్రశాంత్, మెంబర్లు పుప్పాల సతీష్,ఉమేష్, శ్రీకాంత్, ప్రశాంత్ గౌడ్, కాలనీ పెద్దలు, అధిక సంఖ్యలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ కమిషనర్ ఎన్. వసంత చేతుల మీదుగా సానిటేషన్ కార్మికులకు యూనిఫాంల పంపిణీ





**జవహర్‌నగర్: తెలంగాణ షాన్, ఆగస్టు 29:** నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సానిటేషన్ కార్మికులకు నూతన యూనిఫాంలు, రెయిన్‌కోట్లను మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం రోజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ కమిషనర్ ఎన్. వసంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.?ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రతలో సానిటేషన్ కార్మికుల పాత్ర చాలా కీలకమని కొనియాడారు. వారి శ్రమ, అంకితభావం వల్లే నగరంలో పరిశుభ్రత సాధ్యమవుతుందని చెప్పారు. కార్మికుల భద్రత, శ్రేయస్సు కోసం నగర పాలక సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, అందులో భాగంగానే ఈ యూనిఫాంలు, రెయిన్‌కోట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.?ఈ కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి. లలిత, మునిసిపల్ డి.ఇ. మాధవ చారి, మునిసిపల్ మేనేజర్ నగేష్ బాబు, ఆర్.ఓ. వెంకటేశం, జూనియర్ అసిస్టెంట్లు కృష్ణప్ప, కృష్ణా రెడ్డితో పాటు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు పర్యటన : బీబీనగర్ పెద్ద చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష





**భువనగిరి: తెలంగాణ షాన్, ఆగస్టు 29:** రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు (ఐపీఎస్) శుక్రవారం రోజున బీబీనగర్ పెద్ద చెరువును సందర్శించారు. రానున్న గణేష్ నిమజ్జన ఉత్సవాల నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ?నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిషనర్ సుధీర్ బాబు అధికారులకు వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. నిమజ్జనం జరిగే ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. ?ఈ కార్యక్రమంలో భువనగిరి డీసీపీ ఆక్షాన్ష్ యాదవ్, అదనపు డీసీపీ లక్ష్మీ నారాయణ, ఏసీపీ రాహుల్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్ రెడ్డి, బీబీనగర్ సీఐ ప్రభాకర్ రెడ్డి, ట్రాఫిక్ భువనగిరి సీఐ మధుసూదన్ రెడ్డి, ఎస్సై రమేష్ తదితర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి పూజా

## - ముఖ్యఅతిథిగా హాజరైన మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్



**కాప్రా ఆగస్టు 29:** కాప్రా డివిజన్ సాయిబాబా నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాప్రా డివిజన్ మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ గారిని సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ %– % సమాజ అభివృద్ధి, యువత ప్రగతి కోసం ఇలాంటి సంఘాలు ముందుకు రావడం చాలా అభినందనీయం అని, పూజా కార్యక్రమం శాంతి, సౌభాగ్యం మరియు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత సామాజిక సేవలో మరింత చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మౌనిర్టీ డివిజన్ నాయకుడు ముర్తజా, రియాజ్, ఎం. ప్రదీప్, రాజేందర్ సింగ్, సర్జన్ భూల్, జితాధేర్ సింగ్, కిరణ్ సింగ్, రాజేష్ సింగ్, భరత్ సింగ్, సురేష్ సింగ్, రతన్ సింగ్, పవన్ సింగ్, హరా? సర్కి, మధు కుమార్,ప్రకాష్ సింగ్, రాహుల్ సింగ్, రూపేష్ సింగ్, కార్తీక్ సింగ్, రితిక్ భూల్, లోకేష్ సింగ్, జాన్సన్, సంతోష్ భూల్, రాజేష్ సింగ్, చేతన్ సింగ్, మనీష్ సింగ్, పృధ్వీరాజ్, దేవాన్ష్, దినేష్ శివం, సాధమ్,పాల్గొని, యూత్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలను అభినందించారు. అలాగే స్థానిక ప్రజలు, సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే ను కలిసిన డాక్టర్ ఎ ఎస్ రావు నగర్ ధార్మిక సంఘం నాయకులు



కాప్రా ఆగస్టు 29: ఏఎస్ రావు నగర్ డివిజన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ ధార్మిక సంఘం నేతలు. ఈ సందర్భగా డాక్టర్ ఏఎస్ రావు నగర్ లో గల హనుమాన్ దేవాలయం లో జరుగు నవంబర్ 2 వ తేదీన జరిగే సామూహిక కోటి దీపోత్సవ పూజలు లో ముఖ్య అతిథిగా రావాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్ రెడ్డి , మురళి పంతులు, కృష్ణమూర్తి, నర్సింగ్ రావు, చంద్ర కుమార్, మల్లికార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

# యువ పార్లమెంట్ పోటీలకు కేంద్రీయ విద్యాలయం వేదిక







**సికింద్రాబాద్: తెలంగాణ షాన్, ఆగస్టు 29:** తిరుమలగిరిలోని పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం 36వ ప్రాంతీయ స్థాయి యువ పార్లమెంట్ పోటీలకు వేదికగా నిలిచింది. హైదరాబాద్ ప్రాంతం నుంచి 8 కేంద్రీయ విద్యాలయాలకు చెందిన 480 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.?ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖర్ ముఖ్య అతిథిని స్వాగతించారు. ఈ పోటీల్లో విద్యార్థులు తమ చర్చా నైపుణ్యాలు, పార్లమెంటరీ ప్రవర్తనను ప్రదర్శించారు. ?ఈ సందర్భంగా మాట్లాడిన ప్రిన్సిపాల్, పి.కె. కె.వి., గచ్చిబౌలి కె.వి., గోల్కొండ 2 కె.వి., శ్రీంజయనగర్ 1 కె.వి., ఒంగోలు కె.వి., నెల్లూరు కె.వి., కంచన్‌బాగ్ కె.వి. వంటి పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, దీనిని ఎస్.ఎమ్.టి. రూపొందించిందని తెలిపారు. ?ముఖ్య అతిథి జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, ఈ పోటీలు యువత గళాన్ని విజయవంతంగా ప్రతిబింబిస్తాయని, విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వం, దేశభక్తిని పెంపొందిస్తాయని చెప్పారు. విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలను హైదరాబాద్ కె.వి.ఎస్. ఆర్.ఓ. అసిస్టెంట్ కమిషనర్ పి. అనురాధ, బోలారం కె.వి. ప్రిన్సిపాల్ వీణా రోట్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్...విలీనమేనా



**హైదరాబాద్ :** బండి సంజయ్, కేటీఆర్ యాదృచ్ఛికంగానే కలిసి ఉండవచ్చు.. వరద బాధితులను కాపాడాలనే కృత నిశ్చయం వారిద్దరిలోనూ ఉండవచ్చు. అన్నింటికంటే ఎక్కువగా వరదల్లో ఈ బురద రాజకీయం ఎందుకంటూ ఇద్దరు ఒక మెట్టు దిగి ఉండవచ్చు. అంతమాత్రాన అది అక్కడితోనే ఆగిపోదు. ఇప్పుడు అసలే సోషల్ మీడియా కాలం.. చీమ చిట్టుకు మన్నా సరే రకరకాల ప్రచారాలు.. రకరకాల ఊహాగానాలు తెరపైకి వస్తాయి. ఆ తర్వాత జరగాల్సిన పని జరిగిపోతూ ఉంటుంది. దానివల్ల సమాజానికి ఉపయోగం ఉంటుందా.. లేదా.. అనే విషయాలను పక్కన పెడితే జరగాల్సిన చర్చ జరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు తెలంగాణలో కూడా ఒక రకమైన చర్చ నడుస్తోంది.బండి సంజయ్, కేటీఆర్ పరస్పరం తారసపడ్డారు కాబట్టి.. ఇదేది యాదృచ్ఛికమైన కలయిక కాదు. వారిద్దరూ అనుకోని కలిశారు. వారిద్దరు మాత్రమే కాదు కమలం, కారు కూడా త్వరలో కలిసిపోతున్నాయి. 2028 ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఇదే జరుగుతుంది.. ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయి. అందువల్లే బిజెపి నాయకులు గులాబీ నాయకుల మీద.. గులాబీ నాయకులు బిజెపి నాయకుల మీద విమర్శలు చేయడం లేదని రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి. ఇందులో ఎంతవరకు నిజం ఉందో తెలియదు గాని.. ఈ తరహా విశ్లేషణలకైతే అడ్డు అదుపు లేకుండా పోతోంది. వీటిని అటు బిజెపి నాయకులు గాని.. ఇటు గులాబీ పార్టీ నాయకులు గాని ఖండించడం లేదు.. దీంతో వీటి వ్యాప్తికి అడ్డుకట్ట పడడం లేదు.ఇటీవల జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత పలుమార్లు మీడియాతో మాట్లాడారు. కొన్ని ప్రైవేట్ న్యూస్ చానల్స్ లో ముఖాముఖిగా మాట్లాడారు. ఇందులో కారు, కమలం దోస్తీకి సంబంధించిన చర్చ వచ్చింది. గతంలో తాను జైల్లో ఉన్నప్పుడు ఈ ప్రతిపాదన వచ్చిందని.. దానిని తను అడ్డుకున్నట్టు కవిత ప్రకటించారు. అయితే ఇప్పుడు కవితకు, కల్వకుంట్ల తారక రామారావుకు రాజకీయంగా విభేదాలు ఏర్పడ్డాయి. ఈ అన్నాచెల్లెళ్ల మధ్య అగాధం పూడ్చలేని స్థాయికి చేరుకుంది. దీంతో ఎవరి రాజకీయ భవిష్యత్తును వారు వెతుక్కుంటూ ప్రయాణం సాగిస్తున్నారు..జాతీయ రాజకీయాలను కాస్త పక్కన పెడితే.. తెలంగాణ రాజకీయాల్లో ఇటీవల కాలంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అందులో ప్రధానంగా వినిపిస్తున్న చర్చ బిజెపి, కారు పార్టీ కలిసి పోతాయని.. గులాబీ బాస్ కుమార్తె మద్యం వ్యవహారంలో జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు కమలం, కారు దోస్తీ గురించి చర్చ జరిగిందట. ఒకానొక సందర్భంలో కారు పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు.. తన సోదరికి బెయిల్ ఇప్పిస్తే.. ఈ కేసు నుంచి తప్పిస్తే తన పార్టీని కమలంలో విలీనం చేస్తానని మాట కూడా ఇచ్చాడట. ఇదే విషయాన్ని ఇటీవల ఓ పార్లమెంట్ సభ్యుడు బయటపెట్టారు.. దానిని గులాబీ పార్టీ నాయకులు ఖండించినప్పటికీ.. అంతర్గతంగా జరిగింది అదే అని చర్చ మొదలైంది. అంతేకాదు ఇటీవల జాగృతి అధినేత్రి కూడా కారు, కమలం దోస్తీ గురించి మాట్లాడారు.. అయితే దానికి తాను ఒప్పుకోలేదని కుండ బద్దలు కొట్టారు. ఈ పరిణామాలు జరగబోయే విలీనానికి సూచికలని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వాటికి బలం చేకూర్చుతూ కేటీఆర్, బండి సంజయ్ గురువారం పరస్పరం తారసపడ్డారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు.. ఉప్పు నిప్పులాగా ఉండే వీరిద్దరూ పరస్పరం ఎదురు పడటం.. కుశల ప్రశ్నలు వేసుకోవడం ఒకరకంగా చూసేవారికి ఆనందాన్ని కలిగించింది.. అయితే ఈ కలయికను ఏదో యాదృచ్ఛికంగా జరిగింది అనుకోవద్దని.. దీని వెనక చాలానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.. ఎందుకంటే తెలంగాణలో పాగా వేయాలని కమలం పార్టీ అనుకుంటున్నది. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పార్టీకి అనుకున్నంత బలం లేదు. అలాంటప్పుడు కారుతో దోస్తీ కడితే తెలంగాణలో సంయుక్తంగా అధికారం దక్కించుకోవచ్చునేది కమలం పార్టీ ప్లాన్. అయితే ఇది వర్క్ అవుట్ అవుతుందా? లేదా? అనే ప్రశ్నలకు సమాధానం త్వరలోనే లభిస్తుంది. కమలంతో దోస్తీకి కేటీఆర్ కూడా సుముఖంగా ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడు పార్టీలో పెతనం కూడా కేటీఆర్ దే కావడంతో.. అంతిమంగా ఆయన ఏం చెబితే అదే ఫైనల్ అవుతుందని తెలుస్తోంది. ఇప్పటికైతే ఇలానే సాగుతున్నాయి చర్చలు. భవిష్యత్ కాలంలో ఏ వైపు టర్న్ తీసుకుంటాయి.. ఎలా మారిపోతాయి అనేది చూడాల్సి ఉంది. నాడు కవిత తిరస్కరించింది కాబట్టి.. ఇప్పుడు కమలంతో దోస్తీని తాను నెరవేర్చబోతానని కేటీఆర్ భావిస్తున్నట్టు.. అందులో భాగంగానే కమలం పార్టీతో కలిసిపోతున్నట్టు కనిపిస్తోందని రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.. అయితే ఇందులో ఇంతవరకు నిజం ఉందో తెలియదు గానీ.. కవిత మాట్లాడిన మాటలకు కేటీఆర్ చేస్తున్న చేష్టలు వ్యతిరేకంగానే ఉన్నాయి. రోజులు గడిస్తే గాని ఇటువంటి విషయాలపై క్లారిటీ రాదు.. ఏది ఏమైనప్పటికీ రాజకీయాలలో శాశ్వతమైన మిత్రులు ఉండరు. అలాగే శాశ్వతమైన శత్రువులు కూడా ఉండరు. స్థూలంగా చెప్పాలంటే రాజకీయం అనేది ఒక వైకుంఠపాళీ లాంటిది. ఎవరి అవసరాలకు తగ్గట్టుగా వారు అడుగులు వేస్తుంటారు. ఆ అడుగులను వారు సుస్థిరం చేసుకుంటారు. దీనికోసం ఎంతకైనా తెగిస్తారు. ఎక్కడదాకయినా వెళ్తారు. ఇందులో బిజెపి ప్రథమం కాదు. భారత రాష్ట్ర సమితి చివరిది కాదు.

# దారి మళ్లుతున్న సీఎంఆర్ఎఫ్ ఫండ్స్




**నల్గొండ :** ఆపదలో ఉన్నప్పుడు.. వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ పేరుతో ఆర్థిక సహాయం చేస్తూ ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో వివిధ కారణాలవల్ల ఆసుపత్రుల పాలైనవారు.. చికిత్స చేయించుకున్న తర్వాత ప్రభుత్వ సహాయం కోసం సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. దరఖాస్తులను పరిశీలించి.. వైద్య ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా అంచనావేసి.. ప్రభుత్వం తన తరఫున ఆర్థిక సహాయం అందిస్తూ ఉంటుంది. అయితే ఎంతో గొప్ప లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ పథకంలో కొందరు పందికొక్కులు ప్రవేశించారు. ఫలితంగా ఈ పథకం లక్ష్యాన్ని పక్కదారి పట్టించారు. ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులను సొంతానికి వాడుకొని.. లబ్ధిదారుల నోట్లో మట్టి కొట్టారు.సూర్యాపేట జిల్లా కోదాడలో సీఎం అఫ్ చెక్కుల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ కుంభకోణాన్ని సిసిఎస్ పోలీసులు చేదించారు. చెక్కుల కుంభకోణంలో ఆరుగురు సభ్యులున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి కోదాడ పట్టణ పరిధిలో పలువురికి 44 చెక్కులు మంజూరు కాగా.. అందులో 38 చెక్కులను ఈ ముఠా విత్ డ్రా చేసింది.మరో ఆరు చెక్కులను డ్రా చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఏకంగా తొమ్మిది లక్షల నగదు.. 6 స్మార్ట్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు.కోదాడ పట్టణంలో పలువురు రాజకీయ నాయకులు ఈ చెక్కులను కాజేయడానికి ఒక ముఠాగా ఏర్పడ్డారు. సీఎంఆర్ పథకానికి అప్లై చేసుకున్న లబ్ధిదారుల వివరాలను తమకు అనుకూలంగా వీరు మార్చేసేవారు. ఆ తర్వాత ఆ డబ్బులను వేరే ఖాతాలోకి మళ్లించేవారు. కొంతకాలంగా ఈ ముఠా ఈ దందాను దర్జాగా కొనసాగిస్తుంది. సిఎంఆర్ఎఫ్ చెక్కులు సంబంధిత ప్రజా ప్రతినిధి కార్యాలయానికి రావడమే ఆలస్యం.. ఆ చెక్కులను పంపిణీ చేస్తామని మీరు తీసుకుంటారు. ఆ తర్వాత ఆ చెక్కులను దరఖాస్తు చేసుకున్న వ్యక్తిని కాదని.. అతడి ఇంటి పేరుకు దగ్గరగా ఉండే వ్యక్తుల ఖాతాకు నగదు బదిలీ చేస్తారు. బ్యాంకు ఖాతా నెంబర్ పూర్తిగా మార్చేసి అసలు వ్యక్తి ఖాతాలో కాకుండా.. తమ ముఠాలో ఉన్న వ్యక్తి ఖాతాలోకి డబ్బులను బదిలీ చేస్తున్నారు. ఆ తర్వాత ఆ డబ్బులు విత్ డ్రా చేసుకొని వాటాలు వేసుకొని పంచుకుంటున్నారు. ఇటీవల ఓ లబ్ధిదారుడికి చెక్కు మంజూరైన.. అతడికి ఇవ్వలేదు. ఈ విషయాన్ని అతడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

# ప్రభాస్ నిర్మాతల పోటాపోటీ....



ఇండియాలో బిగ్గెస్ట్ స్టార్‌గా అవతరించినప్పటికీ.. యువ కథానాయకులతో పోటాపోటీగా వేగంగా సినిమాలు చేస్తున్నాడు ప్రభాస్. బాహుబలి తర్వాత కొంచెం నెమ్మదిగా అడుగులు వేసినప్పటికీ.. గత కొన్నేళ్లలో బాగా వేగం పెంచాడు. 2023 చివర్లో సలార్ మూవీతో పలకరించిన ప్రభాస్..ఇంకో ఏడు నెలలకే కల్కి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. కొంచెం ప్లానింగ్ సరిగ్గా ఉంటే ఈపాటికి రాజాసాబ్ కూడా రిలీజైపోయేది. ఆ చిత్రం వచ్చే సంక్రాంతికి వచ్చేలా కనిపిస్తోంది. రాజాసాబ్‌కు సంబంధించి కొంత చిత్రీకరణ మిగిలి ఉంది. ఈ సినిమాలో నటిస్తూనే సమాంతరంగా హను రాఘవపూడి సినిమాలోనూ నటిస్తున్నాడు ప్రభాస్. ఫౌజీ అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఆ సినిమా కూడా సగం దాకా చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కోసం ఇంకో మూడు సినిమాల మేకర్స్ ఎదురు చూస్తున్నారు. ఐతే వాటిలో సలార్-2 మొదలు కావడానికి టైం పట్టేలా ఉంది. ఈ చిత్రాన్ని రూపొందించాల్సిన ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌తో డ్రాగన్ తీస్తున్నాడు. కాబట్టి ఇంకో ఏడాది వరకు ఆ సినిమా ఊసేమీ ఉండదు. ఐతే ప్రభాస్ చేయాల్సిన మిగతా రెండు చిత్రాల మేకర్స్ తన కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. సందీప్ రెడ్డి వంగ స్పిరిట్ మూవీని సెప్టెంబరు చివర్లో మొదలుపెడతానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రకటించాడు. ఐతే కల్కి-2 మేకర్స్ కూడా వీలైనంత త్వరగా సినిమాను మొదలుపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ సినిమాకు స్క్రిప్టు, ప్రి ప్రొడక్షన్ దాదాపుగా పూర్తయింది. ప్రభాస్ ఎప్పుడంటే అప్పుడు ఆ చిత్రాన్ని సెట్స్ మీదికి తీసుకెళ్లాలని అనుకుంటున్నారు. ఇది భారీగా విజువల్ ఎఫెక్ట్స్‌తో ముడిపడ్డ సినిమా. ప్రభాస్ సహకరిస్తూ అప్పుడప్పుడు కొన్ని కాల్ షీట్స్ ఇస్తే వాటిని సరిగ్గా వాడుకుని సినిమాను వేగంగా పూర్తి చేయొచ్చని భావిస్తున్నారు.

## హక్కుల కోసం ఓటీటీల పోటీ!



కొవిడ్ టైంలో థియేటర్లు మూతపడి ప్రేక్షకులు ఇళ్లకు పరిమితమైన సమయంలో ఓటీటీ సంస్థలు విజృంభించాయి. ఫ్యాన్సీ రేట్లు ఇచ్చి సినిమాలను కొని నేరుగా రిలీజ్ చేశాయి. అంతే కాక థియేటర్లలో వచ్చిన సినిమాలను కూడా త్వరగా డిజిటల్ రిలీజ్ చేయడం ద్వారా ఆదరణ పెంచుకున్నాయి. రెండు మూడేళ్ల పాటు ఓటీటీలన్నీ సినిమాలకు మంచి మంచి రేట్లు ఇచ్చేవి. క్రేజున్న సినిమాల డిజిటల్ హక్కుల కోసం వాటి మధ్య పోటీ ఉండేది. ఓ మోస్తరు సినిమాలన్నింటికీ ఈజీగా డిజిటల్ హక్కులు అమ్ముడయ్యేవి. కానీ గత రెండేళ్లలో కథ మారిపోయింది. ఓటీటీలు రేట్లు తగ్గించేశాయి. కొనే సినిమాల సంఖ్యనూ తగ్గించుకున్నాయి. ఇప్పుడు నిర్మాతలు డిమాండ్ చేసే స్థితిలో లేరు. డిజిటల్ హక్కుల అమ్మకం కోసం వాళ్లే వెంటపడే పరిస్థితి ఉంది. కోరుకున్న రేట్లూ దక్కడం లేదు.

ఇలాంటి టైంలో ఓ సినిమా మాత్రం ఓటీటీ సంస్థలే తమ వెంట పడేలా, ఫ్యాన్సీ రేట్లు ఆఫర్ చేసేలా చేస్తోంది. ఆ చిత్రమే.. మహావతార నరసింహ. కన్నడలో తెరకెక్కిన ఈ యానిమేటెడ్ మూవీ గత నెల రోజులుగా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ప్రభంజనం సాగిస్తోందో తెలిసిందే. పెద్దగా అంచనాల్లేకుండా విడుదలై కన్నడతో పాటు తెలుగు, హిందీలో సంచలన వసూళ్లతో దూసుకెళ్తోంది. ఆ సినిమా కలెక్షన్లు రూ.300 కోట్లకు చేరువగా ఉన్నాయి.విడుదలై నాలుగు వారాలు దాటినా ఆ సినిమా జోరు తగ్గడం లేదు.

ఈ వీకెండ్లో కూడా మంచి వసూళ్లు రాబట్టింది. ఐతే ఈ చిత్రానికి విడుదలకు ముందు డిజిటల్ హక్కుల అమ్మకం జరగలేదు. నిర్మాతలే అమ్మలేదా.. ఓటీటీల నుంచి ఆఫర్లు లేవా అన్నది తెలియదు. డిజిటల్ హక్కులు అమ్మకుండానే సినిమాను థియేటర్లలోకి తీసుకొచ్చారు. ఇప్పుడేమో సినిమా ఇరగాడేసింది. థియేటర్లలో ఈ సినిమాను చూసేవాళ్లు బాగానే చూస్తున్నారు. ఓటీటీలోకి వస్తే చూద్దామని ఎదురు చూస్తున్న వాళ్లూ పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఫ్యామిలీస్, పిల్లలకు నచ్చే సినిమా కావడంతో ఓటీటీలోకి వచ్చాక మంచి డిమాండ్ ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో ఈ సినిమా హక్కుల కోసం భారీ డిమాండ్ నెలకొంది. ఓటీటీలు ఫ్యాన్సీ రేట్లు ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. భారీ చిత్రాలతో సమానంగా మహావతార నరసింహ డిజిటల్ రైట్స్ అమ్ముడయ్యే అవకాశముంది.

# పెద్ది సినిమాను తిరస్కరించిన నటి!

ప్రస్తుతం ఇండియాలోనే టాప్ స్టార్లలో ఒకడు రామ్ చరణ్. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో అతను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించాడు. అలాంటి హీరో సినిమాలో కీలక పాత్ర చేయమంటే ఏ నటి అయినా సంతోషంగా ఒప్పుకుంటుంది. కానీ మలయాళ నటి స్వశిక మాత్రం చరణ్ కొత్త చిత్రం పెద్ది కోసం అడిగితే నో చెప్పేసిందట. ఆ చిత్ర బృందం నుంచి తనను మళ్లీ మళ్లీ అడిగినా ఆ సినిమా చేయను అనేసిందట. ఇంత క్రేజీ ప్రాజెక్టులో నటించడానికి ఆమెకు వచ్చిన అభ్యంతరం ఏంటి అనిపించడం సహజం. ఐతే ఇందులో ఆమెకు ఆఫర్ చేసింది చరణ్ తల్లి పాత్ర అట.స్వశిక వయసు ప్రస్తుతం 33 ఏళ్లే. రామ్ చరణ్‌కేమో 40 ఏళ్లు వచ్చేశాయి. స్వశిక తమిళ, మలయాళ భాషల్లో కొన్ని మిడిలేజ్డ్ పాత్రలు చేసిన మాట వాస్తవం. ఆమె ఎక్కువగా క్యారెక్టర్ రోల్సే చేస్తోంది. అంత మాత్రాన చరణ్ కంటే ఏడేళ్లు తక్కువ వయసున్న అమ్మాయిని తనకు తల్లిగా నటించమని అంటే ఫీలవ్వకుండా ఉంటుందా? తాను ఇప్పుడే ఆ తరహా పాత్రలు చేయాలనుకోవడం లేదని.. అందుకే ఆ సినిమాకు ఎన్నిసార్లు అడిగినా ఓకే చెప్పలేదని స్వశిక వెల్లడించింది. స్వశిక 2009 నుంచి సినిమాల్లో నటిస్తోంది. తమిళంలో వాగై అనే చిత్రంతో ఆమె కథానాయికగా పరిచయం అయింది. తర్వాత తమిళం, మలయాళంలో పలు చిత్రాల్లో నటించింది. తెలుగులోనూ ఎటు చూసినా నువ్వే అనే చిన్న సినిమాలో నటించింది స్వశిక. ఐతే ఈ మధ్య తమిళం, మలయాళంలో ఆమె చేసిన కొన్ని క్యారెక్టర్ రోల్స్ బాగా క్లిక్ అయ్యాయి. ముఖ్యంగా సూరి హీరోగా చేసిన మామన్ చిత్రంలో ఆమె చేసిన అక్క పాత్రకు చాలా పేరొచ్చింది. అదే సమయంలో ఆమె తెలుగులోకి తమ్ముడు చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఇందులో అడవిలో ట్రక్కు నడిపే వెరైటీ పాత్రలో నటించింది స్వశిక. కానీ ఆ చిత్రం డిజాస్టర్ కావడంతో ఆమెకు తెలుగులో బ్రేక్ రాలేదు. చరణ్ సినిమాలో తల్లి పాత్ర చేస్తే మంచి పేరే వచ్చేదేమో కానీ.. అది తన వయసుకు తగ్గ పాత్ర కాకపోవడంతో నో చెప్పింది. ప్రస్తుతం తమిళంలో ఆమె సూర్య హీరోగా నటిస్తున్న కరుప్పు చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తోంది. తమిళం, మలయాళంలో ఆమె చేతిలో చాలా సినిమాలే ఉన్నాయి.

కానీ మలయాళ నటి స్వశిక మాత్రం చరణ్ కొత్త చిత్రం పెద్ది కోసం అడిగితే నో చెప్పేసిందట. ఆ చిత్ర బృందం నుంచి తనను మళ్లీ మళ్లీ అడిగినా ఆ సినిమా చేయను అనేసిందట. ఇంత క్రేజీ ప్రాజెక్టులో నటించడానికి ఆమెకు వచ్చిన అభ్యంతరం ఏంటి అనిపించడం సహజం. ఐతే ఇందులో ఆమెకు ఆఫర్ చేసింది చరణ్ తల్లి పాత్ర అట.స్వశిక వయసు ప్రస్తుతం 33 ఏళ్లే. రామ్ చరణ్‌కేమో 40 ఏళ్లు వచ్చేశాయి.



## పాత సినిమాలు చూడడం మానేశాను...!



ఏ నటుడైనా తాను నటించిన పాత సినిమాలు చూస్తే మంచి అనుభూతికి లోనవడం సహజం. అందులోనూ తన హిట్ సినిమాలను చూస్తే మరింత ఆనందం కలుగుతుంది. కానీ తనకు మాత్రం తన పాత చిత్రాలను చూస్తుంటే చాలా బాధ కలుగుతోందని అంటున్నాడు మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్. ఈ మధ్య ఆ సినిమాలను చూడడమే మానేసినట్లు ఒక ఇంటర్వ్యూలో వెల్లడించి ఆశ్చర్యపరిచాడు లాలెట్టన్. ఇందుకు ఆయన చెప్పిన కారణం.. అభిమానులను ఉద్వేగానికి గురి చేసింది.కొంత కాలం కిందట మోహన్ లాల్ తన బ్లాక్ బస్టర్ మూవీ చంద్రలేఖ సినిమా చూశాడట. తెలుగులో నాగార్జున హీరోగా అదే పేరుతో వచ్చిన సినిమాకు మాతృకనే ఈ చిత్రం. మోహన్ లాల్‌కు అత్యంత సన్నిహితుడైన ప్రియదర్శన్ ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఐతే ఈ చిత్రంలో హాస్పిటల్ నేపథ్యంలో వచ్చే ఒక కీలకమైన సన్నివేశం చూసి మోహన్ లాల్ చాలా బాధ పడ్డాడట. ఆ సన్నివేశంలో తనతో పాటు నటించిన ఆర్టిస్టుల్లో ఎవ్వరూ ఇప్పుడు జీవించి లేరని.. అందరూ చనిపోయారని.. ఈ విషయం తెలిసి తనకు చాలా బాధేసిందని మోహన్ లాల్ చెప్పాడు.ఆయా నటులతో తనకు ఎన్నో మంచి జ్ఞాపకాలు ఉన్నాయని.. అలాంటి నటులు ఇప్పుడు లేరు అని తలుచుకుంటే బాధేస్తుందని.. అందుకే అప్పట్నుంచి తాను తన పాత చిత్రాలను చూడడం మానేసినట్లు మోహన్ లాల్ తెలిపాడు. ఈ కామెంట్స్ మోహన్ లాల్ అభిమానులను కూడా ఉద్వేగానికి గురి చేస్తున్నాయి. ఈ ఏడాది ఎంపురాన్, తుడరుమ్ చిత్రాలతో రికార్డ్ బ్రేకింగ్ హిట్లు కొట్టాడు మోహన్ లాల్. ఇంతలోనే ఆయన్నుంచి మరో కొత్త సినిమా రాబోతోంది. అదే.. హృదయపూర్వం. మాళవిక మోహనన్ ఇందులో కీలక పాత్ర పోషించింది. సత్యం అంతికాడ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఓనమ్ కానుకగా ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం మీద మంచి అంచనాలే ఉన్నాయి.

## అద్భుతమైన మెలోడీగా 'ఇలా చూసుకుంటానే'

నీలి నీలి ఆకాశం క్రియే షన్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్ మెంట్, ఎన్‌వీఎల్ క్రియే షన్స్ బ్యానర్స్‌పై మున్నా ధులిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ నిర్మాతలు. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి 'ఇలా చూసుకుంటానే' అనే మెలోడీ పాటను ఆదివారం హీరో రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా విడుదల చేశారు. పాట విని, అద్భుతంగా ఉందంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ 'ఇది అద్భుత మైన మెలోడీ పాట. 'నీలి నీలి ఆకాశం' పాట సీక్వెల్‌గా, అంతకన్నా గొప్పగా ఉంటుంది. ఈ పాటను మొత్తం జమ్మూ కాశ్మీర్, మలేషియా ప్రకృతి అందాలలో చిత్రీకరించాం. అనూప్ రూబెన్స్ అద్భుతమైన బాణీ అందిస్తే, సిద్ శ్రీరామ్ తన గాత్రంతో ప్రాణం పోశారు. ఇక



చంద్రబోస్ రాసిన సాహిత్యం అత్యద్భుతంగా ఉంది. అద్భుతమైన మెలోడీ పాటగా అందర్నీ అలరిస్తోంది. ఇది పూర్తిగా వినోద భరిత చిత్రం. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని తెలిపారు.

## ఒక్క రూపాయి కూడా తీసుకోని 'ఏజెంట్'



ఒకప్పుడు టాలీవుడ్లో బిజీ ప్రొడ్యూసర్లలో ఒకడిగా ఉండేవాడు అనిల్ సుంకర. రామ్ ఆచంట, గోపీనాథ్ ఆచంటలతో కలిసి '14 రీల్స్' బేనర్లో 'దూకుడు' సహా పలు భారీ చిత్రాలను నిర్మించిన ఆయన.. 'ఏకే ఎంటర్టైన్మెంట్స్' బేనర్లో విడిగా చిన్న, మిడ్ రేంజ్ సినిమాలనూ ప్రొడ్యూస్ చేశాడు. ఐతే కొన్నేళ్ల తర్వాత 14 రీల్స్ నుంచి బయటికి వచ్చి ఏకే బేనర్లోనే సినిమాలు తీస్తూ వచ్చాడు. ఆ సంస్థను పెద్ద స్థాయికి తీసుకెళ్లేలా కొన్ని క్రేజీ ప్రాజెక్టులను లైన్లో పెట్టాడు అనిల్. కానీ వాటిలో 'సరిలేరు నీకెవ్వరూ' చిత్రం బాగా ఆడినా.. ఆ తర్వాతి చిత్రాలు ఆయనకు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. అఖిల్ అక్కినేని మీద భారీ బడ్జెట్ పెట్టి తీసిన 'ఏజెంట్'.. మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్' ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లు అయ్యాయి. దీంతో అనిల్ ప్రొడక్షన్ హౌస్ సంక్షోభంలో పడింది. ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'భోళాశంకర్' తనను ఎంత పెద్ద దెబ్బ కొట్టిందో ఆయన పరోక్షంగా మాట్లాడాడు. దీంతో సోషల్ మీడియా జనాలు చిరంజీవి వైపు వేలెత్తి చూపించడం మొదలుపెట్టారు. చిరంజీవి వల్ల మంచి నిర్మాత దెబ్బ తిన్నాడంటూ కౌంటర్లు వేశారు. మరోవైపు చిరు అభిమానులు.. అనిల్ కామెంట్లకు హర్టయ్యారు. ఐతే ఒక ఇంటర్వ్యూలో అనిల్.. చిరు తనకు చేసిన సాయాన్ని గుర్తు చేసుకున్నారు.

'భోళా శంకర్' ఫెయిల్యూర్ తర్వాత చిరు తనకు ఎంతగానో అండగా నిలిచారని.. ఆ నష్టాల నుంచి బయటపడడానికి సాయం చేశారని అనిల్ తెలిపారు. ఇక 'ఏజెంట్' ఫలితం గురించి అనిల్ మాట్లాడారు. ఈ సినిమాకు అఖిల్ ఒక్క రూపాయి కూడా పారితోషకం తీసుకోలేదన్నాడు. సినిమా బాగా ఆడితే రెమ్యూనరేషన్ తీసుకునేవాడని.. అలా జరక్కపోవడంతో అతను ఒక్క రూపాయి కూడా పుచ్చుకోలేదని అనిల్ వెల్లడించాడు.

# హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్స్....



'ఈటీవీ విన్'లో విడుదలైన 'కానిస్టేబుల్ కనకం, ఆల్ ఇండియా ర్యాంకర్స్, అనగనగా' చిత్రాలు అద్భుతమైన విజయంతో హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్స్ అందుకున్నాయి. ప్రతి చిత్రం రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో టాప్ ట్రెండింగ్‌లో స్ట్రీమ్ అవుతున్నాయి. ఈ సందర్భంగా మేకర్స్ తెలుగు వినోదోత్సవం హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com